వార్త, హైదరాబాద్, బుధవారం 23, జూలై 2025

# ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఈ యేడాది నుంచే డిగ్రీ కోర్సులు!

## నాలుగు కోర్సుల్లో ప్రవేశాలు, దోస్త్ ద్వారా చేపట్టే అవకాశం

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది వరకు కొత్తగూడెంలో కొనసాగిన మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీని కాస్త ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఆ తరువాత రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహిస్తున్న ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సుల్లో మూడు కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోవడానికి అనుమతించింది. ఇప్పుడు ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఈ ఏడాది నుంచి డిగ్రీ కోర్సులను కూడా ప్రారంభించాలని నిర్ణయించింది. అందులో భాగంగా నేడు(బుధవారం) యూనివర్సిటీకి సంబంధించిన సమావేశం జరగనున్నట్టు తెలిసింది. యూనివర్సిటీలో ఈ ఏడాదిలో బీఎస్‌సిలో బీఎస్‌సి జియోలజీ, బీఎస్‌సి ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బీఎస్‌సి జియో ఫిజిక్స్, బీఎస్‌సి జియో కెమెస్ట్రి కోర్సుల్లో ప్రవేశాలను తీసుకోవాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన నిర్ణయాన్ని నేడు జరిగే సమావేశంలో తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే వీటిలో అడ్మిషన్లను డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) ద్వారా చేపట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లో దోస్త్-2025లో భాగంగా స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్ చేపట్టనున్న నేపథ్యంలో.. స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది. నాలుగు కోర్సుల్లో ఒక్కో కోర్సులో సుమారు 60 సీట్ల చొప్పున 240 సీట్లను భర్తీ చేయనున్నట్టు తెలిసింది. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసిగా విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా కొనసాగుతున్నారు.

మన తెలంగాణ
బుధవారం 23, జులై 2025

# ఎర్త్ సైన్సెస్ వర్సిటీలో నాలుగు కొత్త డిగ్రీ కోర్సులు

**మనతెలంగాణ/హైదరాబాద్** : రాష్ట్రంలో కొత్తగూడెంలోని మైనింగ్ కాలేజీ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ అయిన విషయం తెలిసిందే. ఈ కొత్త యూనివర్సిటీ ఈ విద్యాసంవత్సరం నాలుగు కొత్త డిగ్రీలు, నాలుగు కొత్త పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. బిఎస్‌సి జియాలజీ, బిఎస్‌సి ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బిఎస్‌సి జియో ఫిజిక్స్, బిఎస్‌సి జియో కెమిస్ట్రీ డిగ్రీ కోర్సులతో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కూడా ఇవే కోర్సులను అందుబాటులోకి తీసుకుచ్చేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో దోస్త్ ద్వారా డిగ్రీ ప్రవేశాలు చేపడుతుండగా, ఇప్పటికే రెండు విడతల సీట్ల కేటాయింపు పూర్తయిన విషయం తెలిసిందే. అయితే ఈ నెల 24 నుంచి దోస్త్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రారంభించి మరో విడత ప్రవేశాలు చేపట్టాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఆ లోగా ఈ నాలుగు కొత్త కోర్సులను దోస్త్‌లో చేర్చి ప్రవేశాలు చేపట్టాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. బుధవారం కొత్తగూడెంలోని ఎర్త్ సైన్సెస్ వర్సిటీలో విద్యాశాఖ ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో కొత్త డిగ్రీ, పిజి కోర్సులకు సంబంధించిన సిలబస్, విధివిధానాలను ఖరారు చేయనున్నారు.

నవతెలంగాణ
బుధవారం 23 జూలై 2025

# తల్లిదండ్రులు లోకల్...పిల్లలు నాన్‌లోకల్

- 'శ్రేష్ట' దళిత విద్యార్థుల స్థానికత ఎక్కడ?
- గత ఏడాదీ ఇదే సమస్య...

## పరిష్కరించని ప్రభుత్వం

'కాళోజీ' వైద్య విద్య ప్రవేశాల నిబంధనలపై ఆందోళన




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్లు కావాలనుకునే విద్యార్థుల కలల్ని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం కాలరాస్తోంది. గత ఏడాది చేసిన తప్పునే ఇప్పుడూ కొనసాగిస్తోంది. ఫలితంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్నీ ఆందోళనకు గురిచేస్తోంది. ఎంబీబీఎస్‌లో ప్రవేశాల కోసం విశ్వవిద్యాలయం పెట్టిన నిబంధన ఇప్పుడు తెలంగాణ విద్యార్థులకు కష్టాన్ని, నష్టాన్ని తెచ్చిపెడుతోంది. గతేడాది 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులను స్థానికులుగా గుర్తిస్తున్నట్టు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఫలితంగా పలువురు విద్యార్థులు తాము తెలంగాణకు, అటు ఆంధ్రప్రదేశ్‌కు స్థానికులం కాకుండా పోతున్నామని ఆందోళన చేపట్టారు. ఆ నిబంధనను మార్చాలని విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. కానీ ఈ ఏడాది కూడా అదే నిబంధనను కొనసాగిస్తూ, నోటిఫికేషన్ ఇచ్చారు. దీనితో ఈ ఏడాది కూడా రాష్ట్ర విద్యార్థుల్లో అదే గందరగోళం నెలకొంది. ప్రధానంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లోని విద్యార్థులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు.

తెలంగాణ సరిహద్దు గ్రామాల విద్యార్థులు ఉత్తమ చదువుల కోసం టెన్త్, ఇంటర్ పొరుగురాష్ట్రాలకు వెళ్లి చదువుకుంటారు. అలాగే తెలంగాణ విద్యార్థులు విజయవాడ, గుంటూరు, కర్నూల్ వంటి జిల్లాల్లో టెన్త్, ఇంటర్ చదివేందుకు వెళ్తారు. ఆదిలాబాద్ విద్యార్థులు నాగ్‌పూర్ వెళ్లి చదువుకుంటారు. 2023-24 విద్యాసంవత్సరం వరకు స్థానికత నిర్ధారణకు 6 నుంచి 12వ తరగతి వరకు ఏడేండ్లలో నాలుగేండ్లు వరుసగా ఎక్కడ చదివితే దాన్నే స్థానికతగా పరిగణించేవారు. కానీ గత ఏడాది నుంచి నీట్ నోటిఫికేషన్‌లో 'స్థానికత' నిర్ధారణలో మార్పులు తీసుకొచ్చారు. ఫలితంగా పలు జిల్లాల విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదనే ఆందోళన వ్యక్తం అవుతున్నది.

### జీవో 33 సవరించాలి

గత ఏడాది వైద్యారోగ్యశాఖ జారీ చేసిన జీవో 33ని సవరించాలని ఇప్పటికే పలుమార్లు 'నీట్' పరీక్ష రాసిన విద్యార్థులు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దీనికోసం తమిళనాడులో అవలంబిస్తున్న విధానాన్ని పరిశీలించాలనీ సూచించారు. తమిళనాడులో ఎంబీబీఎస్ స్థానిక కోటాలో సీటు కోసం దరఖాస్తు చేసే అభ్యర్థి ఆరు నుంచి పది వరకు ఆ రాష్ట్రంలో చదువుకుని ఉండాలనీ, వారి తల్లిదండ్రులు తమిళనాడులో స్థిరనివాసులై ఉండాలనే నిబంధన పెట్టారు. తెలంగాణలో మాత్రం అలాంటి నిబంధన లేకపోవడంతో పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఇవీ ఉదాహరణలు...

కొత్తగూడెంకు చెందిన ఒక విద్యార్థి పదవ తరగతి వరకు స్థానికంగా చదువుకోగా, ఇంటర్మీడియట్ విద్యను విజయవాడలో పూర్తి చేశారు. మంచిర్యాలకు చెందిన మరో అభ్యర్థి ఇంటర్మీడియట్‌ను వేరే రాష్ట్రంలో పూర్తి చేశారు. మరికొందరు ఇంటర్మీడియట్‌ను తెలంగాణలో పూర్తి చేయగా, కుటుంబ పరిస్థితుల కారణంగా 9, 10 తరగతులను వేరే రాష్ట్రాల్లో పూర్తి చేశారు. వీరితో పాటు 9 నుంచి ఇంటర్ వరకు ఇతర రాష్ట్రాల్లో చదివిన తెలంగాణ విద్యార్థులు ఉన్నారు. దీనివల్ల తల్లిదండ్రులు తెలంగాణలో స్థానికులుగా ఉంటే, వారి పిల్లలు స్థానికేతరుల కోటాలోకి వెళ్లిపోతున్నారు. దీనిపై గతేడాది పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించడంతో, స్థానికత నిర్ధారణకు మార్గదర్శకాలు రూపొందించాలని కోర్టు తీర్పునిచ్చింది. దీంతో తాత్కాలికంగా ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లకు బ్రేక్ పడింది. అయితే సుప్రీంకోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు స్థానిక కోటా వర్తింపజేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో, గతేడాది అడ్మిషన్ల ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ప్రస్తుత విద్యాసంవత్సరం (2025-26) మళ్లీ పాత నోటిఫికేషనే ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.


### ఇదీ లెక్క.

రాష్ట్రంలో 8,415 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని మొత్తం సీట్లలో 15 శాతం అంటే 637 సీట్లను ఆలిండియా కోటాలో భర్తీ చేస్తారు. మిగిలిన 85 శాతం సీట్లను స్థానికంగా భర్తీ చేస్తారు. ప్రయివేటు వైద్య కళాశాలల్లో 50 శాతం సీట్లను కౌన్సిలింగ్ ద్వారా, మిగతా 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా ద్వారా కాళోజీ యూనివర్సిటీయే భర్తీ చేస్తుంది. ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు కోసం రాష్ట్రంలో ఈనెల 16 నుంచి అభ్యర్థుల రిజిస్ట్రేషన్ మొదలైంది. ప్రభుత్వం 'స్థానికత' సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

### 'శ్రేష్ట' విద్యార్థులు స్థానికులు కారా?

కేంద్ర సామాజిక సాధికారిత మంత్రిత్వశాఖ దళిత విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు 'శ్రేష్ట' పథకాన్ని అమలు చేస్తున్నది. ఈ పథకం కింద ఏటా దాదాపు 3 వేలమంది దళిత విద్యార్థినీ, విద్యార్థులను దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఇంటర్నేషనల్ స్కూళ్లలో 9, 11 తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నది. మన రాష్ట్రం నుంచి కూడా దళిత విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఇతర రాష్ట్రాల్లోని విద్యాసంస్థల్లో సీట్లు పొందారు. కొందరు విద్యార్థులు 9వ తరగతిలో సీటు పొంది 12వ తరగతి వరకు చదువుతుండగా, మరి కొంత మంది 11వ తరగతిలో సీటు పొంది ఇంటర్మీడియట్‌ను అక్కడే పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న నిబంధనతో తాము కూడా స్థానిక కోటాకు అర్హత కోల్పోతున్నామని ఆ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

బుధవారం । 23 । జూలై । 2025
హైదరాబాద్ । www.sakshi.com




# డిగ్రీ ఫిజిక్స్.. ఏఐ ట్రెండ్స్

**డిగ్రీ ఫిజిక్స్ సిలబస్‌లో మార్పులు**

- ఏఐతో అనుసంధానం చేసే చాప్టర్స్
- వైద్య రంగంలో విద్యార్థులను నిలబెట్టేలా సిలబస్
- ఆమోదం తెలిపిన వర్సిటీలు

సాక్షి, హైదరాబాద్

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థి ఇక నుంచి కేన్సర్ చికిత్సలో కీలక పాత్ర పోషించబోతున్నాడు. హృద్రోగ చికిత్సలో ఎలక్ట్రికల్ వేవ్స్ మెకానిజం అందించబోతున్నాడు. బీఎస్సీ డిగ్రీ చేసిన విద్యార్థులే వైద్య రంగంలోని టెక్నికల్ విభాగంలో చక్రం తిప్పే వీలుంది. ఈ దిశగా డిగ్రీలో ఫిజిక్స్ పాత్రను తీర్చిదిద్దుతున్నారు. సిలబస్ మార్పుపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ నేతృత్వంలోని కమిటీ కొన్నేళ్లుగా కసరత్తు చేస్తోంది. మారిన సిలబస్‌కు మంగళవారం మండలిలో జరిగిన సమావేశంలో

మిగతా 5వ పేజీలో ▶

# డిగ్రీ ఫిజిక్స్.. ఏఐ ట్రెండ్స్

▶ మొదటి పేజీ తరువాయి

ఆమోదం తెలిపారు. ఇక నుంచి అన్ని యూనివర్సిటీల్లోనూ ఫిజిక్స్ సిలబస్ ఒకే విధంగా ఉంటుంది. పాత చాప్టర్లన్నీ నవీకరించి అందించబోతున్నారు. ప్రతి చాప్టర్‌లోనూ కాలానుగుణంగా వస్తున్న మార్పులను తీసుకొచ్చారు. డిజిటల్ విధానాలను ఇందులో జోడించారు. తరగతి బోధనే కాకుండా, అనుభవ పూర్వకమైన విద్యా విధానం ఈ ఏడాది నుంచి అందుబాటులోకి రాబోతోంది. సంప్రదాయ డిగ్రీ కోర్సులు కూడా ఉపాధికి బాటలు వేయాలన్న లక్ష్యంతో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేశారు.

## మెకానిక్స్‌లో మజా

డిగ్రీ ఫిజిక్స్‌లో మెకానిక్స్ అండ్ ఆసిలేషన్స్ కీలకమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్య పరికరాలు పనిచేస్తున్న ఈ కాలంలో దీని ప్రాధాన్యత ఎక్కువే. ఎనర్జీ, రొటేషనల్ మోషన్, తరంగ ధైర్ఘ్యం వంటి చాప్టర్స్ ప్రధానమైనవి. న్యూటన్ లా ఆధారంగా ఉండే ఈ చాప్టర్‌ను మరింత సరళీకరించారు. ఏఐతో పని చేసే యంత్ర పరికరాలకు అనుగుణంగా సిలబస్‌లో ప్రాక్టికల్ వర్క్ జోడించారు. దీంతో విద్యార్థి కార్పొరేట్ వైద్య రంగంలో యంత్ర పరికరాల నిర్వహణలో మంచి ఉపాధి అవకాశాలు పొందే వీలుంది. తరంగాలు, ఎలక్ట్రానిక్స్ కదలికలు వంటి మార్పులను రికార్డు చేసే రేడియేషన్ ఫిజిక్స్‌ను ఈసారి అత్యాధునిక టెక్నాలజీకి అనుసంధానం చేస్తూ అందించబోతున్నారు.

## మోడ్రన్ ఫిజిక్స్‌లో మెరుపులు

విద్యుత్ రంగంతోపాటు అత్యాధునిక లేబొరేటరీల్లో పనిచేసే యంత్ర పరికరాలకు ఆయువు పట్టు మోడ్రన్ ఫిజిక్స్. ఏఐ వచ్చిన తర్వాత అటామిక్, సబ్ అటామిక్ లెవల్స్‌ను బేరీజు వేసే విధానం పూర్తిగా మారిపోయింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మోడ్రన్ ఫిజిక్స్‌లో ప్రాక్టికల్ వర్క్‌ను పెంచబోతున్నారు. అత్యాధునిక యంత్రాల్లో క్వాంటం మెకానిక్స్‌ను పరిశీలించేలా ప్రాజెక్టు వర్క్ పెంచుతున్నారు. అణు ఇంధన రంగంలో వచ్చిన మార్పులను గమనించేలా న్యూక్లియర్ ఫిజిక్స్ చాప్టర్స్, సోలార్ ఎనర్జీ ట్రాకింగ్ విధానాల చాప్టర్స్‌ను డిగ్రీలో కొత్తగా నేర్చుకునే అవకాశం ఇక నుంచి ఉండబోతోంది.

## వేవ్స్, ఆప్టిక్స్‌లో వెరైటీ

ఫిజిక్స్‌లో మరో కీలకమైన చాప్టర్ వేవ్స్ అండ్ ఆప్టిక్స్ పూర్తిగా ఉపాధికి బాటలు వేసేలా ఉండాలని నిపుణులు నిర్ణయించారు. తరంగాలు వాటి గతి, ధ్వని తరంగాలు, కాంతి వేగం, కాంతిలో మార్పులు తెలిపే ఈ చాప్టర్‌ను పూర్తిగా ఇప్పుడున్న టెక్నాలజీకి అనుసంధానం చేస్తారు. తరగతిలో కేవలం బోధన సాగితే, ప్రాక్టికల్ నాలెడ్జ్ మొత్తం ప్రధాన కంపెనీల ద్వారా నేర్చుకునే వీలుంటుంది. ఇలాంటి అనేక మార్పులతో కూడిన ఫిజిక్స్ సిలబస్ ఈ ఏడాదినుంచి అందుబాటులోకి రాబోతోంది.



### ఉపాధి పెంచడానికే మార్పులు

సంప్రదాయ డిగ్రీ కోర్సులను ఆధునీకరిస్తున్నాం. నేటి తరం ఆలోచనలు, టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సిలబస్ రూపొందిస్తున్నాం. ఫిజిక్స్‌లో ఆధునిక వైద్య రంగానికి ఉపయోగపడే చాప్టర్లు జోడిస్తున్నాం. విద్యార్థి ప్రాక్టికల్‌గా విషయ పరిజ్ఞానం సంపాదించేలా ప్రాజెక్టు పనులు ఇవ్వబోతున్నాం.
–ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్.

ఈనాడు బుధవారం జులై 23, 2025

# కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ వర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులు

## దోస్త్ ప్రత్యేక విడత, సీపీగెట్ ద్వారా సీట్ల భర్తీ

ఈనాడు, హైదరాబాద్: కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరం(2025-26) నుంచే డిగ్రీ, పీజీ సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిగ్రీలో బీఎస్సీ జియాలజీ, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అనే నాలుగు కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. అవే సబ్జెక్టుల్లో ఎంఎస్సీ కోర్సులను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. డిగ్రీ కోర్సుల్లోని సీట్లను డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ(దోస్త్) ప్రత్యేక విడత ద్వారా భర్తీ చేస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్, దోస్త్ కన్వీనర్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉంటాయన్నారు. ఎంఎస్సీ సీట్లను ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్ష(సీపీగెట్) ద్వారా భర్తీ చేస్తారని పేర్కొన్నారు.

### చివరి నిమిషంలో హడావిడి..

ఈ ఏడాది ఏప్రిల్ 4న కాకతీయ వర్సిటీ పరిధి కొత్తగూడెంలోని మైనింగ్ కళాశాలలను వర్సిటీగా ఉన్నతీకరిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దోస్త్ మూడో విడత సీట్లను జూన్ 28న కేటాయించారు. ఈ పరిస్థితుల్లో ఇప్పటివరకు మిన్నకుండి... ఇప్పుడు డిగ్రీతోపాటు పీజీ కోర్సులు ప్రవేశపెట్టాలనుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చేరారని, ఇప్పుడు చివరి దశలో ఎవరు చేరతారని అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు వర్సిటీలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించాలి? బడ్జెట్ ఎంత అవసరం? ఎంత మంది బోధన, బోధనేతర సిబ్బంది కావాలి? తదితర అంశాలపై నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ తాజాగా ఆదేశించడం గమనార్హం. ఈ అంశాలపై చర్చించేందుకు ఉన్నత విద్యామండలి అధికారులు మంగళవారం ఓయూ ఆచార్యులతో సమావేశం నిర్వహించారు. ఈ పని ఎప్పుడో చేయాల్సింది కదా? అన్న ప్రశ్నలు వస్తున్నాయి. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా బుధ, గురువారాల్లో కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పర్యటించనున్నారు. బుధవారం ఎర్త్ సైన్సెస్ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా ఆమె సమావేశం నిర్వహించనున్నారు.